క్లుప్తంగా

తక్కెళ్లపాడు రోడ్డుకి రూ.25 లక్షలు మంజూరు



దాచేపల్లి : మండలంలోని తక్కెళ్లపాడు గ్రామం ప్రధాన రోడ్డు నిర్మాణానికి ప్రభుత్వం రూ.25లక్షల నిధులు మంజూరు చేసింది. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి కార్యాలయం సోమవారం ఓ ప్రకటన విడుదల చేసింది. ఇటీవల గ్రామంలో పర్యటించిన ఎమ్మెల్యే కాసు దృష్టికి గ్రామస్తులు మెయిన్ రోడ్డు సమస్యను తీసుకువచ్చారు. తక్షణమే స్పందించిన ఆయన రోడ్డు నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. రూ.25 లక్షల నిధులు ప్రభుత్వం విడుదల చేసింది. త్వరలోనే రోడ్డు నిర్మాణానికి చర్యలు తీసుకోనున్నారు. నిధులు మంజూరు చేయించిన ఎమ్మెల్యేకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

మున్సిపల్ కమిషనర్‌కు సత్కారం



మాచర్ల: ఉత్తమ అధికారి అవార్డు పొంది పట్టణాన్ని వివిధ రకాలుగా అభివృద్ధి చేసిన మున్సిపల్ కమిషనర్ ఈవీ రమణబాబును సోమవారం కృష్ణవేణి టాలెంట్ స్కూల్ యాజమాన్యం ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పట్టణంలో అనేక సంవత్సరాలుగా స్వచ్ఛభారత్, స్వచ్ఛ పురపాలక సంఘం కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ రెండు సార్లు ఉత్తమ అవార్డు పొందటం అభినందనీయమని ప్రిన్సిపాల్ హనుమంతరావు అన్నారు. ఈ సందర్భంగా కమిషనర్ రమణబాబును శాలువాతో ఘనంగా సత్కరించి అభినందించారు. బదిలీపై వెళ్తున్న మున్సిపల్ కమిషనర్ సేవలు కొనియాడుతూ ఈ కార్యక్రమం నిర్వహించారు.

ఉత్తమ అధికారికి సన్మానం



రెంటచింతల: అంకిత భావంతో విధులు నిర్వహిస్తూ గ్రామాల అభివృద్ధికి కృషి చేసే అధికారులకు పురస్కారాలు తప్పక వరిస్తాయని గోలి గ్రామ సర్పంచ్ మున్నా చంద్రం అన్నారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఉత్తమ పీఆర్ఏఈగా అవార్డు అందుకున్న పాశం శ్రీనివాసరెడ్డిని ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులు గొట్టం గురువారెడ్డి, గొలమారి శ్రీనివాసరెడ్డిలతో కలిసి ఘనంగా సన్మానించి మాట్లాడారు. విధి నిర్వహణలో ఎప్పుడూ ప్రజలకు, ప్రజాప్రతినిధులకు, స్థానిక అధికారులకు అందుబాటులో ఉంటూ మండల అభివృద్ధికి శ్రీనివాసరెడ్డి విశేషంగా కృషిచేశారన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రభుత్వ పనులను స్థానిక ప్రజా ప్రతినిధుల సహకారంతో నాణ్యతలో రాజీ పడకుండా నూరు శాతం అంకితభావంతో చేపట్టడం వలన తనకు ఈ గౌరవం దక్కిందన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వెల్దుర్తి: వెల్దుర్తి మండల సర్వసభ్య సమావేశం మంగళవారం ఉదయం 10 గంటలకు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ డి.ప్రసాద్ సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిషత్ కార్యాలయంలో జరిగే సర్వసభ్య సమావేశానికి మండలంలోని జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. మండల పరిషత్ అధ్యక్షుడు చింతా శివరామయ్య అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు.

నాడు లక్ష మందికి ఒకటి.. నేడు మరో రెండు

- పీహెచ్‌సీల్లో పెరిగిన ఓపీల సంఖ్య
- రోగులకు ఉచిత వైద్యం, మందులు అందజేత
- పీహెచ్‌సీల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు



నాడు-నేడు ద్వారా ఆధునీకరణ చేసిన దాచేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం



నడికుడిలో నూతనంగా నిర్మించిన అర్బన్ హెల్త్ సెంటర్

దాచేపల్లి : ప్రజల ఆరోగ్య భద్రతకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పెద్దపీట వేసింది. ప్రజల ఆరోగ్యానికి భరోసా కల్పించింది. గత ప్రభుత్వాల్లో లక్షకుపైగా ఉన్న మండల జనాభాకు కేవలం ఒక పీహెచ్‌సీ అందుబాటులో ఉండగా.. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరో రెండు పీహెచ్‌సీలను అందబాటులోకి తెచ్చింది. నాడు కేవలం ఒక్క డాక్టర్ మాత్రమే అందుబాటులో ఉంటే నేడు నలుగురు డాక్టర్లు వైద్య సేవలు అందిస్తున్నారు. పీహెచ్‌సీలలో మెరుగైన వైద్యం అందుతుండటంతో దాచేపల్లి నగర పంచాయతీ, గ్రామాల్లోని ప్రజలు ఏ చిన్న రోగం వచ్చిన వెంటనే దాచేపల్లిలోని పీహెచ్‌సీలకు వస్తున్నారు.

నాడు ఒక్కటే పీహెచ్‌సీ..నేడు మరో రెండు అదనం

దాచేపల్లి నగర పంచాయతీ, మండల పరిధిలోని గ్రామాల్లో 1.15 లక్షల మంది జనాభా ఉన్నారు. వీరికి దాచేపల్లిలోని పీహెచ్‌సీ మాత్రమే అందుబాటులో ఉంది. ప్రజలు అనారోగ్యాల బారిన పడితే పరుగులు తీసుకుంటూ ఈ పీహెచ్‌సీకి వస్తే సరిపడ వైద్యులు, సిబ్బంది లేక నామమాత్రంగానే వైద్యం అందేది. దీంతో అప్పులు చేసి మరీ ప్రజలు ప్రైవేట్ హాస్పిటల్స్‌కి వెళ్లేవారు. లక్షకుపైగా జనాభా ఉన్నపటికీ ఒక్క పీహెచ్‌సీ ఉండటంతో పాలకుల నిర్లక్ష్యంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత స్థానిక ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి చొరవతో ప్రస్తుతం ఉన్న పీహెచ్‌సీని నాడు-నేడు ద్వారా రూ.50 లక్షల నిధులతో ఆధునీకరించారు. దాచేపల్లిలోని జలగడ బజార్, నడికుడిలో రూ.కోటి నిధులతో రెండు అర్బన్ హెల్త్ సెంటర్ భవనాలు నిర్మించి ప్రజలకు అందుబాటులోకి తెచ్చారు. గామాలపాడులో మరో పీహెచ్‌సీ నిర్మాణానికి చర్యలు తీసుకున్నారు.

నాడు ఒక్కరే వైద్యులు..నేడు నలుగురు వైద్యులు

లక్షమంది జనాభాకు నాడు ఒక్కరే వైద్యులు అందుబాటులో ఉండగా.. నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కొత్తగా ముగ్గురు డాక్టర్లను అందుబాటులో ఉంచారు. ప్రస్తుతం రోజుకి 240 మందికిపైగా వైద్య సేవలు పొందుతున్నారు. నెలకు సగటున 10 కాన్పులు, 35 నుంచి 40 వరకు కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు జరుగుతున్నాయి. సాధారణ రోగాలకు ఉచితంగా వైద్య పరీక్షలు చేసి మందులు అందిస్తున్నారు. కుక్క, పాము కాటుకు మందులను అందుబాటులో ఉంచారు. నలుగురు డాక్టర్లతో పాటు 45 మంది సిబ్బంది వైద్య సేవలు చేస్తున్నారు. 104 ద్వారా కూడా ప్రజలకు వైద్యం అందిస్తున్నారు. పీహెచ్‌సీలను ఏర్పాటు చేసి వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచటంతో ప్రభుత్వ పనితీరు పట్ల ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

మంచి వైద్యం చేస్తున్నారు..



నాకు 70 ఏళ్లు. గత ప్రభుత్వాల్లో పీహెచ్‌సీకి వస్తే వైద్య సిబ్బంది లేక సక్రమంగా వైద్యం చేయలేదు. ఇప్పుడు హాస్పిటల్‌కి వస్తే పిలిచి పలకరించి మంచిగా వైద్యం చేస్తున్నారు. సాధారణ జబ్బులకు వైద్యం చేసి మందులు కూడా ఉచితంగా ఇస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉండటం వలన మాలాంటి నిరుపేదలకు నాణ్యమైన వైద్యం అందుతుంది.

కొమ్మా చిన్న వెంకమ్మ, దాచేపల్లి

ఒక్క రూపాయి ఖర్చులేకుండా వైద్యం చేస్తున్నారు..



సాధారణంగా ఏ జబ్బుకైన హాస్పిటల్‌కి వెళ్తే వేలల్లో ఖర్చు అవుతుంది. ఈ ప్రభుత్వం వచ్చిన తరువాత నేను పలుమార్లు అనారోగ్యంకు గురై వైద్యం కోసం వచ్చాను. వైద్యం చేసి పరీక్షలు ఉచితంగా చేసి రూపాయి ఖర్చు లేకుండా మందులు ఇచ్చారు. గతంలో పరీక్షలు బయట చేయించుకోమని చెప్పేవారు. ఇప్పుడు ఇక్కడే పరీక్షలు చేసి వైద్యం అందించటం బాగుంది. ఇటువంటి ప్రభుత్వం మళ్లీ రావాలి.

పప్పుల వీరాస్వామి, ఇరికేపల్లి

గర్భిణులకు వైద్యం బాగా అందుతుంది..



ప్రస్తుత పరిస్థితుల్లో ప్రైవేట్ హాస్పిటల్స్‌లో గర్భిణులు వైద్యం పొందాలంటే చాలా ఖర్చవుతుంది. కానీ పీహెచ్‌సీలో గర్భిణులకు ఉచితంగా వైద్యం చేసి కాన్పులు కూడా చేస్తున్నారు. కాన్పు అయిన తరువాత ప్రభుత్వం ప్రోత్సాహం కూడా అందిస్తుంది. ఈ ప్రభుత్వంలో మరో రెండు పీహెచ్‌సీలను అందుబాటులోకి తేవటం బాగుంది.

చవ్వా నవ్య, ముత్యాలంపాడు

నాణ్యమైన వైద్యం అందించటం మా బాధ్యత..



ప్రభుత్వం కోట్లాదిరూపాయలు వైద్యంపై ఖర్చు చేస్తుంది. వైద్య సేవలు అందించేందుకు అన్ని వసతులు, పరికరాలు ప్రభుత్వం కల్పించింది. డాక్టర్‌గా ప్రజలకు ప్రభుత్వం ద్వారా సేవ చేసే అవకాశం దొరకటం అదృష్టంగా భావిస్తున్నాను. పీహెచ్‌సీల్లో ఓపీ బాగా పెరిగింది. వైద్యంలో రాజీపడకుండా ప్రభుత్వానికి మంచి పేరు వచ్చేలా పనిచేస్తున్నాం.

పి.సుచరిత, దాచేపల్లి పీహెచ్‌సీ

పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా గిరికుమార్



పిడుగురాళ్ల: పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా బీఎస్ గిరికుమార్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు విధులు నిర్వహించిన కమిషనర్ ఎ.వెంకటేశ్వర్లు తిరుపతి జిల్లా గుడూరు మున్సిపాలిటీకి బదిలీ అయ్యారు. నూతనంగా పిడుగురాళ్ల మున్సిపల్ కమిషనర్‌గా బీఎస్ గిరికుమార్ బాధ్యతలు చేపట్టారు. ఆయన గతంలో మాచర్ల మున్సిపాలిటీలో చేశారు. ప్రస్తుతం మార్కాపురం మున్సిపాలిటీ నుంచి పిడుగురాళ్ల మున్సిపాలిటీకి ఎన్నికల బదిలీల్లో భాగంగా ఇక్కడకు వచ్చినట్లు కమిషనర్ తెలిపారు.

పాస్టర్లు ప్రజలను మంచి మార్గంలో నడిపించాలి



గురజాల : పాస్టర్లు ప్రజలను మంచి మార్గంలో నడిపించే విధంగా చర్యలు తీసుకోవాలని నియోజకవర్గ పాస్టర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కొమ్ము నాగేశ్వరరావు అన్నారు. స్థానిక జి.ఐ.సి కాలనీలో కృపామయుడు ప్రార్థన మందిరం 7వ వార్షికోత్సవ వేడుకలను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ జాలి, దయ, కరుణ కలిగి ఉండాలన్నారు. పాస్టర్లు అందరూ ఐకమత్యంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ కాపరి ఆంధ్రయ్య, పాస్టర్లు అబ్రహం, ఏసుదాసు, సాల్మన్‌రాజు, సాగర్, జయప్రకాష్, రాజేష్, ఆదూరి మాణిక్యరావు, సంఘ విశ్వాసులు, తదితరులున్నారు.

భక్తిశ్రద్ధలతో ఉరుసు మహోత్సవం



బాబావారికి చాదర్‌ను సమర్పిస్తున్న ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి

తుమ్మకోట(రెంటచింతల): మండలంలోని తుమ్మకోట గ్రామంలో శుక్రవారం రాత్రి దర్గాలో ఉరుసు వేడుకలను ముస్లిం సోదరులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ప్రభుత్వ విప్, పల్నాడు జిల్లా అధ్యక్షులు, మాచర్ల ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ఈ ఉరుసు మహోత్సవంలో పాల్గొని బాబావారికి నూతన చాదర్‌ను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించి గంధ మహోత్సవాన్ని ప్రారంభించారు. ప్రత్యేకంగా అలంకరించిన బాబావారి గుర్రం గంధం, గలఫ్‌లతో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్కే మాట్లాడుతూ ఎంతో పవిత్రమైన ఉరుసు మహోత్సవంలో పాల్గొనడం చాలా సంతోషకరమన్నారు. ముస్లిం సోదరులకు ఎల్లప్పుడూ అండగా ఉంటానని వారి అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఎన్.బాలునాయక్, ఎంపీపీ దాసరి చౌడేశ్వరి, మండల పార్టీ అధ్యక్షులు గొట్టం బ్రహ్మారెడ్డి, మాజీ అధ్యక్షులు పూజల రామయ్య, జేసీఎస్ జిల్లా కన్వీనర్ మోర్తల ఉమ, మండల యూత్ అధ్యక్షులు కొమ్మారెడ్డి సతీష్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు పోట్ల ముత్తయ్య, ఎంపీటీసీ షేక్ జానీబాషా, నాయకులు షేక్ గోరేబుడే మహ్మద్ షరీఫ్, షేక్ సైసావలి, షేక్ గోరేబుడే సుభాని, తాళ్లపల్లి మహ్మద్ జాన్, కారంపూడి జానీ, పోట్ల శ్రీనివాసరావు, పేర్ల ముత్తయ్య, తుమ్మా ఇన్నారెడ్డి, సత్రశాల దేవస్థానం చైర్మన్ బొద్దూరి బ్రహ్మారెడ్డి పాల్గొన్నారు.

పునీతురాలు మరియతల్లి

ఫాదర్ కిశోర్

రెంటచింతల: ప్రపంచ మానవాళిని పాపముల నుంచి రక్షించుటకు యెహోవా దేవుడు తన కుమారుడైన లోకరక్షకుడు ఏసుక్రీస్తు జన్మించుటకు ఎన్నుకోబడిన పునీతురాలు మరియతల్లి అని క్రోసూరు విచారణ గురువులు రెవ.ఫాదర్ గాదె కిశోర్ అన్నారు. స్థానిక కానుకమాత చర్చి 174వ మహోత్సవంలో భాగంగా సోమవారం విచారణ గురువులు రెవ.ఫాదర్ ఏరువ లూర్దుమర్రెడ్డి ఆధ్వర్యంలో ఆనంద్‌పేట కాలనీలో నిర్వహించిన నవదిన ప్రార్థనలలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కన్య మరియమ్మ జీవితం కథోలిక సంఘానికి ఆదర్శనీయమన్నారు. ఎంతో పవిత్రమైన మరియతల్లిని ప్రార్థించిన వారి తలంపులు నెరవేరి ఆ తల్లి ఆశీస్సులతో వారు సుఖసంతోషాలతో ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. ఈ నవదిన ప్రార్థనలలో పాల్గొని తల్లి మరియ ఆశీస్సులు పొందాలని కోరారు. దివ్యపూజాబలిలో ఫాదర్లు అగస్టీన్, డీకన్ బ్రదర్ కోడిగంటి నిఖిల్ తేజ, కన్యాస్త్రీలు, చర్చి పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణలో విద్యుత్ శాఖాధికారులు

మాచర్ల: ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్సీ) ఆధ్వర్యంలో మొదటి రోజు వీడియో కాన్ఫరెన్సులో ప్రజాభిప్రాయ సేకరణ సోమవారం నిర్వహించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో భాగంగా మాచర్ల విద్యుత్ డివిజనల్ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్సు ఈఈ జె.హరిబాబు ఆధ్వర్యంలో జరిగింది. ఈ కార్యక్రమంలో డీఈ ఎ.రామయ్యతో పాటు 9 మండలాల విద్యుత్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖాధికారులు పాల్గొని వివిధ సమస్యలను, అభిప్రాయాలను తెలుసుకున్నారు.

రేపు పురపాలక సంఘ బడ్జెట్ సమావేశం

మాచర్ల: పట్టణానికి చెందిన పురపాలక సంఘ బడ్జెట్ సమావేశాన్ని ఈ నెల 31న బుధవారం నిర్వహించనున్నట్లు మున్సిపల్ చైర్మన్ మాచర్ల చిన ఏసోబు, కమిషనర్ ఈవీ రమణబాబు సోమవారం తెలిపారు. బడ్జెట్ సమావేశం సందర్భంగా ప్రతి అంశంపై పట్టణ అభివృద్ధికి సంబంధించి చర్చ జరుగుతుందన్నారు. ఉదయం 11 గంటలకు మున్సిపల్ కౌన్సిల్ హాలులో జరిగే సమావేశానికి ప్రభుత్వ విప్ పిన్నెల్లి రామకృష్ణారెడ్డి హాజరవుతారన్నారు. ఈ సమావేశానికి తప్పనిసరిగా కౌన్సిలర్లు, కోఆప్షన్ మెంబర్లు, అధికారులు హాజరు కావాలని కోరారు.

ఆదర్శప్రాయుడు వెంకటరమణ



ప్రిన్సిపాల్ వెంకటరమణను సత్కరిస్తున్న ఏఎంసీ చైర్మన్ గోపాల్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద

దుర్గి: దశాబ్ద కాలంగా పల్నాటి ప్రాంతంలో విద్యారంగంలో విశేష సేవలను అందించి పదవీ విరమణ చేయనున్న చెట్టి వెంకటరమణ పలువురికి ఆదర్శనీయుడిగా నిలిచారని మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్ అన్నారు. సోమవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజిలో నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మార్కెట్ యార్డు చైర్మన్ వెలిదండి గోపాల్, జెడ్పీటీసీ శెట్టిపల్లి యలమంద హాజరయ్యారు. గోపాల్ మాట్లాడుతూ వెనుకబడిన పల్నాడు ప్రాంతంలో విద్యారంగానికి విశేష కృషి చేసిన వెంకటరమణ సేవలు ఎనలేనివని తెలిపారు. శెట్టిపల్లి యలమంద మాట్లాడుతూ పలు ప్రాంతాలలో పనిచేసి గత 7 సంవత్సరాలుగా దుర్గిలో విద్యారంగానికి, కళాశాల అభివృద్ధికి ఎనలేని సేవలు అందించారన్నారన్నారు. పలువురు జిల్లా విద్యాధికారులు వెంకటరమణ దంపతులను సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. సర్పంచ్ రాయపాటి మాణిక్యం, ఎంపీటీసీ కటకం గోపాల్, వైఎస్సార్‌సీపీ యూత్ మండల కన్వీనర్ బుచ్చిబాబు, డీఐఈవో లీలావతిదేవి, ఆర్ఐవో జుబేరు, బాపట్ల డీఐఈవో టి.యర్రయ్య, మాజీ ఆర్ఐవో ఉమాదేవి, రామచంద్రరావు, ఆర్‌జెడీ ఏవో శ్రీనివాస్‌విఠల్, లెక్చరర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

మేలు జాతి పశు సంపదను అభివృద్ధి చేసుకోవాలి



మాట్లాడుతున్న డాక్టర్ మోహన్‌రెడ్డి

కారెంపూడి: కృత్రిమ గర్భధారణ ద్వారా మేలు జాతి పశువులను అభివృద్ధి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని పశు వైద్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ డీఎస్ఎం మోహన్‌రెడ్డి రైతులకు సూచించారు. కారెంపూడి పశు వైద్యశాలలో జాతీయ పశు కృత్రిమ గర్భధారణ (ఎన్ఏఐపీ) దినోత్సవం సందర్భంగా పశుపోషణపై రైతులకు సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ కృత్రిమ గర్భధారణ ద్వారా పశువులకు చూలు కట్టించడం ద్వారా మేలు జాతి దూడలు ఉత్పత్తి అవుతాయని, ఇలా మేలు జాతి పశు సంపదను అభివృద్ధి చేసుకోవడం ద్వారా రైతులు అభివృద్ధి సాధించవచ్చన్నారు. నాటు రకం పశువుల కంటే మేలు జాతి పశువుల ద్వారా అధిక పాల దిగుబడి సాధించడం చూస్తున్నామన్నారు. ప్రదర్శనలో ఉంచిన మేలు జాతి లేగ దూడలను రైతులకు చూపించారు. పశు వైద్యాధికారులు కారెంపూడి, డాక్టర్ ఎస్.పద్మావతి, బ్రాహ్మణపల్లి డాక్టర్ వి.శ్రీనివాసరెడ్డి, దుర్గి డాక్టర్ డి.దిలీప్, అంబులెన్స్ డాక్టర్ ఎ.గణేష్, పశు వైద్య సహాయకులు, సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు వరం ఆడుదాం ఆంధ్రా

- ఆడుదాం ఆంధ్రాలో ఉత్సాహంగా పోటీ పడుతున్న యువత
- ఉత్తమ జట్లు జిల్లా స్థాయికి ఎంపిక
- ముగిసిన నియోజకవర్గ స్థాయి పోటీలు



ఖోఖోలో పోటీ పడుతున్న క్రీడాకారులు




నియోజకవర్గ స్థాయి క్రికెట్‌లో విజయం సాధించిన మాచవరం జట్టు

గురజాల : గ్రామాల్లో క్రీడలపై ఆసక్తి ఉండి అవకాశం లేక గ్రామాల్లోనే ఆడుకుంటూ ఉండే వారికి రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో మంచి అవకాశం కల్పించింది. క్రీడలపై ఆసక్తి ఉన్న 15 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ గ్రామీణ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకు క్రీడల్లో ప్రతిభ కనబరచారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ప్రతిభ ఉన్న క్రీడాకారులకు మంచి అవకాశాన్ని కల్పించి వారిని ఉన్నత స్థాయికి తీసుకువెళ్లే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపట్టారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, క్రికెట్, బ్యాడ్మింటన్ పోటీలు నియోజకవర్గ స్థాయిలో ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలను నగర పంచాయతీ కమిషనర్‌లు, ఎంపీడీవోలు, డీఎల్‌డీవోలు పర్యవేక్షించారు. ఈ పోటీలకు పీడీలు, పీఈటీలు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

నియోజకవర్గ స్థాయి క్రికెట్ విజేత మాచవరం జట్టు

మాచవరం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా నియోజకవర్గ స్థాయి క్రికెట్ పోటీల్లో మాచవరం సచివాలయం జట్టు విజయం సాధించింది. మండల స్థాయిలో విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయికి ఎంపిక కాగా, నియోజకవర్గ స్థాయిలోనూ విజయం సాధించి జిల్లా స్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు మండల కో-ఆర్డినేటర్ నందిపాటి నర్సిరెడ్డి తెలిపారు. విజయం సాధించిన జట్టుకు సర్పంచ్ రాగిడి నరేష్, సచివాలయ కార్యదర్శి పి.శ్రీనివాసరావు, ఎంపీటీసీ అనురాధ కృష్ణాజినేయులు, పలువురు గ్రామ నాయకులు అభినందనలు తెలియజేశారు.

క్రీడాకారులకు ఒక వరం..



క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా పోటీలు ఒక వరం. గ్రామీణ స్థాయి లో మంచి ప్రతిభ ఉన్న వారిని రాష్ట్ర స్థాయికి తీసుకువెళ్లి వారిలో దాగిఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహదపడుతున్నాయి. ఈ పోటీల్లో ప్రతిభ కనబరిచిన వారికి మంచి అవకాశాలు లభిస్తాయి. ఆడుదాం ఆంధ్రా ద్వారా క్రీడాకారులకు ఎంతగానో దోహదపడుతుంది.

ఎ.మోహన శ్రీనివాస్, నగర పంచాయతీ కమిషనర్ గురజాల


క్రీడాకారులకు ప్రోత్సాహం..



ఆడుదాం ఆంధ్రా వలన ఎంతో మంది క్రీడాకారులకు ప్రోత్సాహం లభిస్తుంది. గ్రామాల్లో ఎంతో మంది క్రీడాకారులు గుర్తింపు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ పోటీలు వారిలో క్రీడా స్ఫూర్తిని నింపుతున్నాయి. మా లాంటి క్రీడాకారులు ఎంతో మంది నిరుత్సాహంతో ఉన్నారు. నియోజకవర్గ స్థాయిలో గెలిచి జిల్లా స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ప్రతిభను కనబరిచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటాం.

పాతరగడ్డ గనిరాజు, కబడ్డీ ఆటగాడు

ఆడుదాం ఆంధ్రా ఎంతో ఉపయోగకరం..



ఆడుదాం ఆంధ్రా క్రీడాకారులకు ఎంతో ఉపయోగకరం. మా జట్టు జిల్లా స్థాయికి ఎంపిక కావడం ఆనందంగా ఉంది. ఈ విధంగా క్రీడాకారులను ప్రోత్సహించడం బాగుంది. మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయి ఈ విధంగా ప్రోత్సహించడం బావుంది. ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరుతో ఈ విధంగా ప్రోత్సహించడం శుభపరిణామం.

మొగిలి ప్రసన్న కుమార్, కబడ్డీ ఆటగాడు